కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ప్రజలకు సూచించారు. ఆదివారం భారత్‌వికాస్ సంకల్పయాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హఫీజ్‌పేట, జనప్రియనగర్ తదితర ప్రాంతాల్లో డివిజన్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కోసం పార్టీ శ్రేణులు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, డాక్టర్ అరవింద్, తేజ, మనోహర్‌గౌడ్, రవి, జితేందర్, శ్రీనివాస్‌యాదవ్, కోటేశ్వరరావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



కాంగ్రెస్‌లో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

చందానగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చందానగర్ భవానీనిపురం బస్తీలో ఆదివారం కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించారు. బస్తీలోని ప్రతి సమస్యనూ ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సునీతరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గఫూర్, చందర్‌రావు, పోచన్న, సైపుల్లాహ్‌ఖాన్, వేణు, రాము, ఆయాజ్‌ఖాన్, శ్రీకాంత్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భవానిపురం బస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి దండం పెట్టుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో ముత్యాలమ్మ ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ నాయకులు ఎస్.మాధవరెడ్డి, సిద్ధిరాములు, సుధాకర్, నరేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీహోమం



చండీహోమంలో భక్తులు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం చండీహోమం, లలిత పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చెరుకు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.



ప్రగతినగర్‌లో మ్యూజికల్ 7వ సంగీత అకాడమీని ఆదివారం గాయకుడు అనురాగ్ కులకర్ణి, మ్యూజికల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి ప్రారంభించారు. - నిజాంపేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి)

జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మృతి



ప్రొఫెసర్ శ్రీనివాసరావు (ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జేఎన్‌టీయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్, ఈసీఈ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాసరావు శనివారం రాత్రి 11 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. గత సోమవారం కారులో కాలేజీకి వెళుతుండగా ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో సిబ్బంది ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. నల్లగండ్లలోని స్వగృహంలో శ్రీనివాసరావు భౌతికకాయానికి ఆదివారం ఉదయం జేఎన్టీయూ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి, వర్సిటీ రెక్టార్ కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, డైరెక్టర్లు కృష్ణమోహనరావు, రవీంద్రారెడ్డి, ప్రజాసంబంధాల అధికారి పి.ప్రసన్న, పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. శ్రీనివాసరావు వర్సిటీలోని ప్రతి ఒక్కరి మనసులో తనదైన ముద్ర వేసుకున్నారు. యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ విభాగం డైరెక్టర్‌గా, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా, టెక్విప్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఓ మంచి ప్రొఫెసర్‌ను యూనివర్సిటీ కోల్పోయిందని ఆయనతో కలిసి పనిచేసిన బోధన, బోధనేతర సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు.

బీజేపీ గచ్చిబౌలి డివిజన్ ప్రధాన కార్యదర్శి...



శ్రీనివాస్‌చారి (ఫైల్)

రాయదుర్గం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి ఆదివారం మృతిచెందారు. ఆయన గచ్చిబౌలి డివిజన్ ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారు. అదేవిధంగా ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలో సేవలు అందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆయన లేనిలోటు పార్టీకి తీరనిదన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



దేవతామూర్తులతో ఆలయ కమిటీ సభ్యులు



జాతరలో ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి విగ్రహాలు

వైభవంగా కట్టమైసమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో కట్టమైసమ్మ అమ్మవారు

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా శివసత్తుల ఆటపాటలు, గంగిరెద్దుల సందడి, పోతురాజుల విన్యాసాల నడుమ సూరారం కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ అమ్మవార్ల జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. పూజల్లో ప్రధానంగా అమ్మవార్ల అలంకరణ, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడిబియ్యాలు, మంగళహారతి, బోనాలు నిర్వహించారు. జంటనగరాల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో సూరారం ప్రధాన రహదారి భక్తులతో కిక్కిరిసిపోయింది. జాతరకు పలువురు ప్రజాప్రతినిదులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, హేమలతా సురేష్‌రెడ్డి, నాయకులు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయకమిటీ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సూరారం పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. సూరారం ప్రధాన రహదారి పొడవునా భక్తులు నిండిపోవడంతో ట్రాఫిక్‌ను పోలీసులు దారిమళ్లించారు.



బోనాలతో మహిళలు, భక్తులు



అమ్మవారిని దర్శించుకొన్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

లోక్‌సభ ఎన్నికల్లో అధిక సీట్లు సాధించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిజాంపేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అధిక సీట్లు సాధించి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేసేందుకు కార్యకర్తలు కష్టపడాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాన్ని తిరిగి గెలుచుకోవాలని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్‌కు కంచుకోటగా మార్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కష్టపడి పనిచేసినప్పుడే ఫలితాలు సాధిస్తామన్నారు. అనేక ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవచేస్తున్న వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన రెండు వందల మందికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో కందాడి జ్యోత్స్న శివారెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, భవానీరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు, నాయకులు, కార్పొరేటర్ వీరబాబుగౌడ్, దగ్గుపాటి సత్యనారాయణరెడ్డి, దాసరి చందు, మేడ కల్యాణి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మూసాపేటలో జనరిక్ మెడికల్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో ప్రజలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న భారత్ వికాస్ పరిషత్ నిర్వాహకుల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మూసాపేటలోని హనుమాన్ చౌక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 15వ జనరిక్ మెడికల్ స్టోర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలోని పేదలకు నాణమైన మందులను తక్కువ ధరకే పొందేందుకు జనరిక్ మెడికల్ స్టోర్స్ ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ సహకారంతో 12 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. కార్యక్రమంలో పరిషత్ నిర్వాహకులు అశ్వినీ సుబ్బారావు, సీహెచ్.సుబ్బారావు, అనిల్, చైతన్య, మహేశ్వరి, అనిల్‌కుమార్, సుదర్శన్, నరేంద్రకృష్ణ, సాధన నర్సింహాచారి, తిరుపతిరెడ్డి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 13న తలపెట్టిన చలో నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచించారు. బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దండమూడి ఎన్‌క్లేవ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకుల అనుభవ రాహిత్యంతో తెలంగాణ ప్రజలకు నీటి కష్టాలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ వేణుయాదవ్, డివిజన్ అధ్యక్షులు అశోక్, భాస్కర్, శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేవలం రూ.8 వేల కోట్లను మాత్రమే కేటాయించిందని, ఇవి ఏమాత్రం సరిపోవని, రూ.20 వేల కోట్లను కేటాయించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల ఊసేలేదని, రూ. 5,300కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలను రూ.5 వేల నుంచి రూ. 20వేలకు పెంచాలన్నారు.

ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్ ఇంట్లో చెలరేగిన మంటలు

- పేలిన గ్యాస్ సిలిండర్



పూర్తిగా కాలిపోయిన గది, అందులోని వస్తువులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సయ్యద్ షాహిద్‌కు చెందిన ఇంట్లోని మొదటి అంతస్తులో కొంతకాలంగా కోటగిరి విజయలక్ష్మి నివాసం ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఫ్రిజ్ నుంచి పొగలు రావడం ఆమె గమనించింది. వెంటనే మొదటి అంతస్తు నుంచి కిందకు దిగివచ్చి అక్కడ ఉన్న వారికి విషయాన్ని చెప్పింది. క్షణాల్లోనే ఆ గదిలో భారీ మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే మంటల దాటికి ఫ్రిజ్‌లోని గ్యాస్ సిలిండర్‌తోపాటు వంట గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలాయి. ఈ సమాచారాన్ని హయత్‌నగర్, రామోజీఫిల్మ్‌సిటీలోని అగ్నిమాపక సిబ్బందికి చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫిల్మ్‌సిటీ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. విజయలక్ష్మి దాచుకున్న రూ. 12వేలతోపాటు దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.

తక్షణ సాయం కింద రూ. 5 వేలు

విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం కింద తహసీల్దార్ రూ. 5 వేలు మంజూరు చేశారు. ఆ నగదును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకా మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బాలకృష్ణ, సురేష్, సత్తయ్య, సాంబయ్య, మహేందర్, నిరంజన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కార్మికుడి మృతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ సాదత్‌నగర్‌కు చెందిన సద్దాంషేక్ బక్షూ(32) భవన నిర్మాణ మేస్త్రీ. అలీనగర్‌లోని ఓ భవనం రెండో అంతస్తులో ఆదివారం అల్యూమినియం రాడ్‌తో ఫ్లోరింగ్ పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు రాడ్డు విద్యుత్ తీగలకు తాకింది. కరెంట్ షాక్ కొట్టడంతో అతడు పక్కనే ఉన్న మెట్లపై పడ్డాడు. వెంటనే సమీపంలోని ఒవైసీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. భార్య హీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంపలబస్తీలో వ్యక్తి దారుణ హత్య



యాసిన్ (ఫైల్)

జీడిమెట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంపలబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరు అనుమానితులను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గంపలబస్తీకి చెందిన ఎస్‌కె.యాసిన్ (48) సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్‌లో గతంలో పాన్‌షాప్ నిర్వహించాడు. కుటుంబ కలహాలతో ఇతడి భార్య సంవత్సరం క్రితం పిల్లలను తీసుకుని బార్కస్‌లోని పుట్టింటికి వెళ్లింది. కొద్దికాలం క్రితం పాన్ షాప్ అమ్మిన యాసిన్ కూలీ పనిచేసుకుంటున్నాడు. మూడు రోజుల క్రితం యాసిన్ నివాసముంటున్న గదికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు మద్యం తాగారు. వారి మధ్య ఘర్షణ జరిగి యాసిన్‌ను హత్య చేశారు. ఆదివారం మధ్యాహ్నం యాసిన్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా మెడ, ఒంటిపై కత్తిపోట్లు కనిపించాయి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై దాడి

- మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

గాజులరామారం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేస్తుండగా.. విధుల్లో ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ ఆపడానికి ప్రయత్నించగా ఆ వ్యక్తి పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం 60 యార్డ్స్ కాలనీకి చెందిన మూడవత్ కృష్ణ అలియాస్ క్రాంతి సూరారం సిగ్నల్ వద్ద శనివారం రాత్రి రోడ్డుపై బండరాయితో హల్‌చల్ చేశాడు. సూరారం కట్ట మైసమ్మ జాతరలో విధులు నిర్వహించి స్టేషన్‌కి వస్తున్న ఏఎస్ఐ మల్లేష్, కానిస్టేబుల్ బాలకృష్ణ కలిసి క్రాంతి దగ్గరికి వెళ్లి ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు అని చెప్పినా వినిపించుకోలేదు. 'మీరెవరు నాకు చెప్పేందుకు' అంటూ తన హెల్మెట్‌తో ఏఎస్ఐని, ఆపబోయిన కానిస్టేబుల్ బాలకృష్ణని కూడా కొట్టాడు. గాయాలైన వారిని సమీపంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి పోలీసులు స్థానికులు తరలించి చికిత్స అందించారు. ఏఎస్ఐ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన క్రాంతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నిజాంపేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో గల చైతన్య భవనంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు బాచుపల్లి సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో ఎస్‌ఓటీ బాలానగర్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28 వేలా 500 నగదు, మూడు సెల్ ఫోన్‌లు, రెండు పేకాట బాక్సులు స్వాధీనం చేసుకున్నారు.

మదీనగూడలో ఉచిత వైద్యశిబిరం

మియాపూర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని మదీనగూడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిటిజన్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారికి రక్తపోటు, షుగర్, పల్స్, దంత పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ షకీనాగ్రేసీ, డాక్టర్ కృష్ణ, స్థానికులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవేందర్‌నగర్, రావినారాయణరెడ్డినగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాల్



అధ్యక్షుడిగా ఎన్నికైన సాతాల గోపాల్

గాజులరామారం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దేవేందర్‌నగర్, రావినారాయణరెడ్డినగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాతాల గోపాల్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎనుకున్నారు. బస్తీవాసులు మొత్తం 277 మంది ఓటు హక్కును వినియోగించుకోగా గోపాల్‌కు 140, ప్రత్యర్థి నర్సింహులుకు 136, ఒక ఓటు నోటకు వేశారు. నాలుగు ఓట్ల మెజారిటీతో అధ్యక్షుడిగా సాతాల ఎన్నికయ్యారు.

మంథన్ స్కూల్ విద్యార్థులకు కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులు



కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులు సాధించిన విద్యార్థులు వివాన్, ఇషాన్, హాసిని

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ మార్చి 2023 సిరీస్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచిన మంథన్ స్కూల్ విద్యార్థులకు అత్యుత్తమ కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులు లభించాయి. ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాల విద్యార్థులు పాల్గొన్న ఈ పరీక్షల్లో మంథన్ స్కూల్ విద్యార్థులు హాసిని, ఇషాన్, వివాన్ అవార్డులు గెలుచుకున్నారు. ముంబైలోని లలిత్‌లో జరిగిన వేడుకలో కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంథన్ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, రుచికా ఉపాధ్యాయ మాట్లాడుతూ ఈ అవార్డులు రావడం అధ్యాపకులు, సిబ్బంది ప్రతిభకు నిదర్శనమన్నారు. సౌత్ ఇండియా మేనేజర్ పౌలమి ఘోష్ మాట్లాడుతూ కేంబ్రిడ్జ్ పరీక్షల్లో అద్భుతమైన విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన మంథన్ పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

'కల్యాణ్‌నగర్' అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం



నూతన సభ్యులతో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ కల్యాణ్ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకరం చేశారు. కొద్ది రోజుల క్రితం ఓటింగ్ ద్వారా అధ్యక్షుడిగా ఎన్నికైన వంగల వసంత్‌రావు మిగత కమిటీ సభ్యులను నియమించారు. ఉపాధ్యక్షులుగా ఆర్. మధు, ఎన్.ఉదయభాస్కర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజ కిషోర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రపాల్, కోశాధికారిగా బాలకిష్టయ్య, శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా లక్ష్మణ్, వి.వి.వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా పాండురంగం, చక్రవర్తి, విక్రం నియమితులయ్యారు. వీరితో పాటు ఇద్దరు లీగల్ అడ్వైజర్లు, ఆరుగురు సలహాదారులు, 10మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నియమితులయ్యారు. వీరు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకరం చేశారు.

నేడు భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేయనున్నారు. నాలుగోఫేజ్ ఎంఐజీ ఫ్లాట్స్, ఐదోఫేజ్ జీహెచ్ఎంసీ పార్కు, తొమ్మిదోఫేజ్ పొలిమేర షాపు, సర్దార్‌పటేల్‌నగర్, ఎస్ఎస్ కాలనీల్లో జరిగే అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు, పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని కార్పొరేటర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.